క్లుప్తంగా

మెడికల్ కార్డు రెన్యువల్ చేసుకోవాలి

ఇల్లెందు: సీపీఆర్ఎంఎస్ - ఎన్ఈ మెడికల్ కార్డు రెన్యువల్ చేసుకోవాలని సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ అన్నారు. ఆదివారం ఇల్లెందులో మాట్లాడుతూ... మెడికల్ కార్డు ఉన్న మాజీ ఉద్యోగులు, వారి సతీమణులు లైఫ్ సర్టిఫికెట్ సమర్పించి రెన్యువల్ చేసుకోవాలని చెప్పారు. 282 మంది మాజీ ఉద్యోగులు గత నవంబర్ మాసం నుంచి రెన్యువల్ కోసం దరఖాస్తు చేసుకోలేదన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


గురువులతో పూర్వ విద్యార్థులు

సుజాతనగర్: సుజాతనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999-2000 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులంతా 24 ఏళ్ల తరువాత అదే పాఠశాలలో ఆదివారం కలుసుకున్నారు. ఇన్ని సంవత్సరాల తరువాత నాటి స్నేహితులను కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఒకరినొకరు ఆత్మీయంగా పలుకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సెల్ఫీలతో సందడి చేశారు. గురువులను శాలువాలు, మెమెంటోలతో సన్మానించారు.

సెల్‌ఫోన్ అప్పగింత


సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్సై గిరయ్య

కొత్తగూడెంఅర్బన్: రైల్వే స్టేషన్‌లో సెల్‌ఫోన్ పాగొట్టుకున్న వ్యక్తికి తిరిగి ఆదివారం ఆర్‌పీఎఫ్ పోలీసులు అప్పగించారు. ఎస్సై మాట్లాడుతూ... కొత్తగూడేనికి చెందిన అంగోత్ రామ్ గత శనివారం భద్రాచలం రోడ్డు రైల్వే స్టేషన్‌లో తన సెల్‌ఫోన్‌ను స్టేషన్‌లో ఆవరణలో మర్చిపోయి రైలు ఎక్కాడు. సెల్‌ఫోన్‌ను గమనించిన ఆర్‌పీఎఫ్ పోలీసులు వెంటనే అనౌన్స్‌మెంట్ చేశారు. ఎవరూ రాకపోవడంతో పోలీసు స్టేషన్‌లో భద్రపరిచారు. ఈ క్రమంలో అంగోత్ రామ్ తన ఫోన్ కోసం ఆర్‌పీఎఫ్ స్టేషన్‌కు రాగా, అతని వివరాలు, సెల్‌ఫోన్ వివరాలను అడిగి తెలుసుకొని ఫోన్‌ను అప్పగించారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 11 సంఘటనలలో రూ.2,67,500 విలువ గల వస్తువులను రికవరీ చేసి ప్రయాణికులకు అప్పగించినట్లు ఎస్సై వివరించారు. రైల్వే స్టేషన్ ప్రాంగణాలలో విధి నిర్వహణలో సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ, ప్రయాణికులకు సురక్షిత ప్రయాణం అందే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

ఇంటి పన్నులకు ఏదీ మోక్షం?

గ్రామపంచాయతీలకు ప్రధాన ఆదాయ వనరు ఇంటి పన్నులు మాత్రమే. ఇతరత్రా వనరులు ఉన్నప్పటికీ స్థానిక పరిస్థితులను గమనించి వాటి జోలికి వెళ్లడం లేదు. ఆదాయం తక్కువగా ఉండటం, గ్రాంట్ల విడుదలలో జాప్యం, పెరిగిన ఖర్చులు తదితర కారణాలతో ప్రస్తుతం గ్రామపంచాయతీలకు నిధులు ప్రధాన సమస్యగా మారింది. ఈ పరిస్థితిలో నిధులు మంజూరు చేయడమో.. ఆదాయ వనరులు పెంచడమో చేయాల్సిన ప్రభుత్వం ఆ దిశగా ఆలోచన చేయకపోవడంతో గ్రామపంచాయతీల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది.


పోచారం తండా వ్యూ

- తప్పుల తడకగా ఇంటిపన్నుల జాబితా
- నూతన నిర్మాణాలకు వసూళ్లేవి?
- భారీగా ఆదాయం కోల్పోతున్న పంచాయతీలు

ఇల్లెందురూరల్: గ్రామపంచాయతీలలో 1998-99లలో ఇళ్ల వివరాలను రివిజన్ చేశారు. నిబంధనల ప్రకారం ప్రతీ ఐదేళ్లకోసారి ఇంటి పన్నుల జాబితాను రివిజన్ చేయాల్సి ఉంది. కానీ ఇంటి పన్నుల జాబితా రివిజన్‌ను ఉన్నతాధికారులు విస్మరించడంతో నేటికీ 25 ఏళ్ల నాటి జాబితా ఆధారంగానే ఏటా పంచాయతీ కార్యదర్శులు ఇంటి పన్నులు వసూలు చేస్తున్నారు. రివిజన్‌కు ఏజెన్సీ చట్టాలు అడ్డుగా ఉన్నాయని ఉన్నతాధికారులు చెప్పడం విచిత్రంగా ఉంది. ఏజెన్సీ చట్టాలు 1970 నుంచి అమలులో ఉన్నాయి. నాటి నుంచి వరుసగా 1998-99 వరకు రివిజన్ చేసిన ఉన్నతాధికారులు ఆ తరువాత రివిజన్ ఊసెత్తకపోవడం పంచాయతీలకు శాపంగా మారింది.

ప్రహసనంగా ఆన్‌లైన్, రివిజన్ ప్రక్రియ...

గ్రామపంచాయతీలకు సంబంధించి ఇంటి పన్నుల జాబితాను ఆన్‌లైన్ చేయాలని 2012లో అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. కానీ నాటి నుంచి ఏడాదికేడాది గడుపుతూ వచ్చిన పాలకులు ఎట్టకేలకు 2018లో అమలులోకి తెచ్చారు. అదికూడా 1998-99 ఇంటి పన్నుల జాబితాను ఆధారంగా చేసుకొని ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేశారు. ఆ తరువాత ఇంటి పన్నుల జాబితా రివిజన్ చేసే లక్ష్యంగా 2020లో అప్పటి ప్రభుత్వం గ్రామపంచాయతీల వారీగా ఇంటింటి సర్వే నిర్వహించింది. గృహాల కొలతలు తీసుకోవడంతోపాటు ఇంటి యజమానిని ఇంటి ముందు నిలబెట్టి ఫొటోలు కూడా తీశారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని ధరణిలో పొందుపర్చారు. కానీ నేటికీ ఈ ప్రక్రియ అమలులోకి రాలేదు.

లొసుగులను సాకుగా చేసుకొని..

గ్రామపంచాయతీ ఇంటి పన్నుల జాబితా ఆన్‌లైన్ చేయడంలో చోటుచేసుకున్న తాత్సారం అప్పటి పంచాయతీ కార్యదర్శులు, గుమస్తాలకు ఆదాయ వనరుగా మారిందన్న ఆరోపణలు ఉన్నాయి. నూతనంగా నిర్మించుకున్న ఇంటి యజమానులు తమ ఇంటికి ఇంటి నంబర్ కేటాయించాలని గ్రామ పంచాయతీలలో దరఖాస్తులు పెట్టుకోవడం, ఆ వెంటనే వారికి ఇంటి నంబర్ కేటాయించడం చకచకగా జరిగిపోయేవి. ఈ వ్యవహారాలలో పెద్దమొత్తంలో డబ్బులు చేతులు మారాయన్న ఆరోపణలు లేకపోలేదు. ఇంటి పన్నుల జాబితా ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తికావడం, ధరణి పేరిట సర్వే ప్రారంభించిన సమయంలో గతంలో చేసిన తప్పిదాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వచ్చాయి. సుమారు దశాబ్దకాలంగా ఇంటి నంబర్లు కేటాయించిన వారి పేర్లు ఏవీ వాస్తవ జాబితాలో నమోదు కాలేదు. అంతేకాకుండా ఒక్కో నంబర్‌ను పది నుంచి ఇరవై ఇళ్లకు కేటాయించారు. అయితే జాబితాలో లేని ఇళ్లకు పన్నులు వసూలు చేయకపోవడంతో యజమానులు కూడా మిన్నకుండిపోయారు.

కొత్త ఇళ్లకు సేవా పన్నుతో సరి...

గ్రామపంచాయతీలలో నూతనంగా నిర్మిస్తున్న ఇళ్లకు అనుమతులు లేవు. తాజా నిబంధనల ప్రకారం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే క్షేత్రస్థాయిలో పంచాయతీ కార్యదర్శి విచారణ చేసి నివేదికను ఉన్నతాధికారులకు పంపుతారు. ఈ నివేదిక ఆధారంగా ఉన్నతాధికారులు ఇంటి నంబర్‌ను కేటాయిస్తారు. కానీ ఏజెన్సీ చట్టాలను బూచీగా చూపుతూ నూతన నిర్మాణాలకు ఎటువంటి అనుమతులు మంజూరు చేయడం లేదు. అయినా యథేచ్ఛగా ఇంటి నిర్మాణాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ కారణంగా అనుమతులకు సంబంధించిన ఆదాయాన్ని కూడా పంచాయతీలు నష్టపోతున్నాయి. ఇంతేకాకుండా నూతనంగా నిర్మించుకున్న ఇళ్లకు విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో గృహ యజమానులు ఆందోళనలకు దిగుతున్నారు. ఇలాంటి పరిస్థితిలో 'సాక్షి'లో ప్రచురితమైన వరుస కథనాలకు స్పందించిన ఉన్నతాధికారులు ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్న గృహాలకు మెమో నం.512 ప్రకారం సేవా పన్ను తీసుకొని విద్యుత్ కనెక్షన్‌కు అనుమతి మంజూరు చేశారు. కానీ ఇంటి నంబర్ జాబితా ప్రక్షాళన మాత్రం చేయలేదు.

ఆదాయం కోల్పోతున్న పంచాయతీలు..

ఏజెన్సీ గ్రామాలలో గిరిజనేతరులు నిర్మించుకుంటున్న ఇళ్లకు ఇంటి నంబర్ కేటాయించి ఇంటి పన్నులు పూర్తిస్థాయిలో వసూలు చేస్తే ఒక్కో గ్రామ పంచాయతీకి ప్రస్తుతం ఉన్న ఆదాయం కంటే రెట్టింపు ఆదాయం వచ్చే అవకాశం ఉంది. కానీ ఆ దిశగా పాలకులు అడుగులు వేయకపోవడంతో గ్రామపంచాయతీలు పెద్దమొత్తంలో ఆదాయాన్ని కోల్పోతున్నాయి.

నిబంధన ప్రకారం వసూలు చేస్తున్నాం..



ప్రభుత్వ నిబంధనల ప్రకారమే గ్రామపంచాయతీలలో ఇంటి పన్నులు వసూలు చేస్తున్నాం. ఇంటి పన్నుల రివిజన్ జరగకపోవడంతో నేటికీ 1998-99 నాటి జాబితా ప్రమాణికంగా వసూలు జరుగుతోంది. నూతనంగా నిర్మించుకున్న ఇళ్లకు ఉన్నతాధికారుల ఆదేశం మేరకు సేవా పన్ను వసూలు చేస్తున్నాం.

– చిరంజీవి, ఎంపీఓ, ఇల్లెందు

ప్రశాంతంగా గురుకులాల ప్రవేశ పరీక్ష

పాల్వంచరూరల్: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, గిరిజన సంక్షేమ పాఠశాలలో 7 నుంచి 9 తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీ కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతగా జరిగింది. 671మంది విద్యార్థులు హాజరయ్యారు. లక్ష్మీదేవిపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో 8,9 తరగతుల ప్రవేశ పరీక్ష జరగగా... 8వ తరగతి పరీక్షకు 297 మందికి 263 మంది హాజరు కాగా 34మంది గైర్హాజరయ్యారు. 9వ తరగతికి 96మందికిగాను 80మంది హాజరై 16మంది గైర్హాజరయ్యారు. గురుకుల బాలికల పాఠశాలలో 7,9 తరగతుల ప్రవేశపరీక్షకు 7వ తరగతి పరీక్షకు 245మందికి 224 మంది హాజరు కాగా 21మంది గైర్హాజరయ్యారు. 9వ తరగతి పరీక్షకు 132మందికి 114 మంది హాజరుకాగా 18మంది గైర్హాజరైనట్లు ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్స్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, వేములపల్లి దుర్గ తెలిపారు. పరీక్షలను గిరిజన సంక్షేమశాఖ ఆర్‌సీఓ రాజు పర్యవేక్షించారు.

అక్కాచెల్లెళ్ల ప్రతిభ...


అక్షరశ్రీ


తక్షశ్రీ

టేకులపల్లి: తొమ్మిదోమైలు తండాకు చెందిన అక్కాచెల్లెళ్లు (కవలలు) గురుకులం ప్రవేశ పరీక్షలో ప్రతిభను కనబరిచి సీటు సాధించారు. సారపు నవీన్ - మమత దంపతుల కుమార్తెలు అక్షరశ్రీ, తక్షశ్రీ సులానగర్‌లోని కార్మెల్ మాత పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నారు. ఇటీవల గురుకులంలో ఐదో తరగతి ప్రవేశ పరీక్షలో ఇద్దరూ రాణించారు. ఈ మేరకు కారేపల్లిలోని గురుకులంలో సీటు వచ్చినట్లు ఆదివారం తల్లిదండ్రులు తెలిపారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం


ప్రచారం చేస్తున్న నాయకులు

పాల్వంచరూరల్: ఖమ్మం పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోదరావును గెలిపించాలని కోరుతూ బీజేపీ నాయకులు ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండల పరిధి లక్ష్మీదేవిపల్లి, బస్వతారక కాలనీ, సోములగూడెం, కేశవాపురం గ్రామాలలో పోలింగ్ బూత్‌ల ఇన్‌చార్జ్ ధరావత్ నరేష్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. పానిశెట్టి వెంకటేశ్వర్లు, వల్లపు మురళి, శ్రీను, కిట్టు, ప్రదీప్, రమ, త్రివేణి, అనురాధ, సుధీర్ పాల్గొన్నారు.

అనాథాశ్రమానికి రూ.లక్ష విరాళం


వస్తువులు అందజేస్తున్న జీఎం శాలేంరాజు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని పీవీకే-5 ఇంక్‌లైన్ ఉద్యోగులు ప్రతీనెల వారి జీతం నుంచి సోషల్ వెల్ఫేర్ ఫండ్ కోసం రికవరీ చేసిన సొమ్ముతో కొనుగోలు చేసిన రూ.1.25 లక్షల విలువగల వస్తువులను ఆదివారం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజు భద్రాచలంలోని అనాథ, వృద్ధ, మానసిక దివ్యాంగుల ఆశ్రమానికి ఆదివారం వితరణ చేశారు. ఈ సందర్భగా జీఎం మాట్లాడుతూ.. భగవంతుడు మనకు ఇచ్చిన దాంట్లో కొంత పేదవారికి వితరణ చేయాలనే ఆలోచన 5షాఫ్ట్ ఉద్యోగులకు రావటం, దాని అమలులో భాగంగా ఈరోజు అనాథాశ్రమంలో వితరణ చేయటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమానికి ప్రోత్సహించిన గని మేనేజర్ పాలడుగు శ్రీనివాస్‌ను ప్రశంసించారు. కార్యక్రమంలో పీవీకే-5 ఇంక్‌లైన్ ఏజెంట్ రవీందర్, మేనేజర్ పాలడుగు శ్రీనివాస్, సంక్షేమాధికారి అజయ్‌కుమార్, యూనియన్ నాయకులు సాయిపవన్, వై.శంకర్, బోరింగ్ శంకర్, విజయగిరి శ్రీనివాస్, ఆసిఫ్, భుక్యా రమేష్, సాంబమూర్తి, కుమార కృష్ణ, దేవ్ సింగ్, ఉద్యోగులు పాల్గొన్నారు.

న్యూడెమోక్రసీ అభ్యర్థిని గెలిపించండి..


తూర్పుగూడెంలో ప్రచారం చేస్తున్న నాయకులు

టేకులపల్లి: సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి మోకాళ్ల మురళీకృష్ణకు ఓటు వేసి అధిక మెజారిటీతో గెలిపించాలని పార్టీ టేకులపల్లి మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం తూర్పుగూడెంలో కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. మాట్లాడుతూ... బీజేపీ ప్రభుత్వం నూతన అటవీ సంరక్షణ నిబంధనలను తీసుకొచ్చి ఆదివాసీలను అడవుల నుంచి గెంటివేసేందుకు ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. వ్యవసాయాన్ని కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెట్టేందుకు తెచ్చిన మూడు చట్టాలని రద్దు చేయాలని ఆందోళన చేసిన రైతులను మోదీ ప్రభుత్వం కాల్చి చంపిందని ఆరోపించారు. నిత్యావసర ధరలు విపరీతంగా పెంచడంతో పేద మధ్యతరగతి ప్రజలు మూడు పూటలు తినే పరిస్థితి లేదని వాపోయారు. 75 ఏళ్ల స్వాతంత్ర్య భారతదేశంలో నిత్యావసర పంపిణీ వ్యవస్థ కూడా బాగలేదని ఆరోపించారు. ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చి వరాల జల్లులు కురిపించి ఒక్క హామీని కూడా నెరవేర్చే పరిస్థితి లేదని అందులో భాగమే సీతారామ ప్రాజెక్టు, రోళ్లపాడు ప్రాజెక్టు బయ్యారం, ఇనుప ఖనిజ ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టలేదని కనీసం శంకుస్థాపన కూడా చేయలేదని విమర్శించారు. పీజీలు, డిగ్రీలు పీహెచ్‌డీలు చేసి ఉద్యోగాలు లేని యువత చాలామంది ఉన్నారని వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించే పరిస్థితి లేదని పేర్కొన్నారు. బొగ్గు బావుల కోసం ఓపెన్ కాస్టు పేరుతో అడవులను నరికి వేస్తూ పల్లెలను ఛిద్రం చేస్తూ ఉద్యోగాలు లేకుండా యువతని పెడదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. భారతదేశం అభివృద్ధి చెందుతోందని చెబుతూనే మరోపక్క కులమతాల మధ్య చిచ్చుపెడుతూ ప్రజలను విభజించు పాలించు అనే పద్ధతిలో బ్రిటీష్ పాలనను మరిపిస్తోందని విమర్శించారు.

పాలక పార్టీలను ఓడించి మతోన్మాదాన్ని ఎండగడుతూ పోరాడుతున్న విప్లవ శక్తుల అభ్యర్థి మోకాళ్ల మురళీకృష్ణను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుగులోత్ రామచంద్రు, నరసయ్య, మంగయ్య, ప్రసాద్, రాము, లక్ష్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల సమర్పణ

టేకులపల్లి: మొక్కంపాడు తండాలో శ్రీలక్ష్మి, శ్రీ భూలక్ష్మి సహిత శీతల పరమేశ్వరి (బొడ్రాయి), శ్రీ రేణుక పరమేశ్వరి (ముత్యాలమ్మ), శ్రీ రణపోతు రాజు తదితర గ్రామ దేవతల ప్రతిష్ఠా మహోత్సవం ప్రతిష్ఠాచార్యులు శ్రీరంగం అజయ్ సాయి చక్రి, అజయ్ శర్మల అర్చకత్వంలో గతవారం ఘనంగా జరిగింది. వేడుకల్లో భాగంగా తొమ్మిదో రోజు ఆదివారం గ్రామంలో మహిళలు భారీ సంఖ్యలో తరలివచ్చి బోనాలతో ఊరేగింపుగా తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

మోదీ విధానాలకు నిరసనగా మేడే



మాట్లాడుతున్న రామయ్య

ఇల్లెందు: కేంద్రంలో మోదీ ప్రభుత్వం పదేళ్లుగా అనుసరిస్తున్న ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ మేడేను నిర్వహించాలని ఇఫ్టూ రాష్ట్ర కార్యదర్శి జి.రామయ్య కోరారు. ఆదివారం ఇల్లెందులోని చంద్ర కృష్ణమూర్తి విజ్ఞాన కేంద్రంలో ఎంఎల్ మాస్‌లైన్ అనుబంధ ఇఫ్టూ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. రాయయ్య మాట్లాడుతూ... కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న హక్కులను మోదీ ప్రభుత్వం కాలరాస్తోందన్నారు. 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చివేసిందని, కార్మికుల సమ్మెపై అనేక ఆంక్షలు విధించిందని తెలిపారు. 8 గంటల పని హక్కును కాలరాసీ ఎన్ని గంటలైనా పని చేసుకోవచ్చనే నిబంధన విధించిందని చెప్పారు. ఇలాంటి అనేక కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలని కోరారు. రైతులకు వ్యతిరేకంగా చట్టాలు తెచ్చిందని విమర్శించారు. మోదీ విధానాలకు వ్యతిరేకంగా గ్రామగ్రామాన కార్మిక లోకం మేడే నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి యాకుబ్‌షావలీ, గోపాలరావు, మల్లెల వెంకటేశ్వర్లు, పాయం వెంకన్న, సుందర్, శ్రీరాములు, శేషయ్య, గురునాథం, మల్సూర్ పాల్గొన్నారు.

అకాలవర్షంతో అతలాకుతలం



కొత్తగూడెంఅర్బన్: పాతకొత్తగూడెంలో వాహనంపై పడిన చెట్టు, బస్టాండ్ సెంటర్‌లో

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలో ఆదివారం సాయంత్రం భారీ గాలివానకు పట్టణంలోని పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి. ఇళ్ల బయట ఉన్న సామగ్రి, మార్కెట్లలో అమ్మకాలకు పెట్టిన సామగ్రి గాలికి కొట్టుకుపోయింది. రామవరంలో వనందాస్‌గడ్డలో గాలి బీభత్సానికి ఓ ఇంటి పైకప్పుగా ఉన్న రేకులు కొట్టుకపోయి, వర్షానికి ఇళ్లంతా బురదమయం అయింది. పాతకొత్తగూడెంలో చెట్లు విరిగిపోయి వాహనాలపై పడ్డాయి. బస్టాండ్ ఏరియాలో చెట్లు విరిగి రోడ్డుపై పడడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. 31వ వార్డులో విద్యుత్ స్తంభంపై చెట్టుపడడంతో స్తంభం విరిగి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

సింగరేణి(కొత్తగూడెం): ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉక్కపోత, వడగాలి, బయటకు వెళ్లేందుకు వీలు లేకుండా ఉంది. ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కురిసిన రాళ్ల వర్షం ఉపశమనం కలిగించినప్పటికి గాలి, దుమ్ము, వర్షంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. రామవరం, రుద్రంపూర్, గౌతంపూర్, పెనగడప, 4 ఇంక్‌లైన్, 3 ఇంక్‌లైన్ తదితర ప్రాంతాల్లో కొన్నిచోట్ల విద్యుత్ వైర్లు తెగిపడడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. సింగరేణి ఆస్పత్రి ఎదురుగా చెట్లు విరిగి ఆటోపై పడింది.

పాల్వంచరూరల్: ఉదయం నుంచి ఎండ తీవ్రంగా ఉన్న వాతావరణం ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా చల్లబడి గాలి, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. గాలిదుమారానికి మండలంలో పలుచోట్ల చెట్టుకొమ్మలు విరిగిపడగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడంది. రైతులు పంటపొలాల్లో, కల్లాల్లో, కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబెట్టిన వరి ధాన్యాన్ని తడవకుండా పరదాలను కప్పుకుని రక్షణ చేసుకున్నారు.

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంలో కురిసిన అకాల వర్షం ఈదురుగాలులకు భారీ వృక్షాలు నేలకొరిగాయి. అనిశెట్టిపల్లి నుంచి ఇల్లెందు క్రాస్ రోడ్ వరకు సుమారు 20 భారీ వృక్షాలు విరిగి పడిపోవడంతో కిలోమీటర్ మేర ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. లక్ష్మీదేవిపల్లి ఎస్‌ఐ రమణారెడ్డి రెండు జేసీబీలు, పోలీస్ సిబ్బందితో వచ్చి రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్లను తొలగించి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చేశారు.

జూలూరుపాడు: మండలంలో ఆదివారం గాలి, వాన బీభత్సం సృష్టించింది. ఉరుములు, మెరుపులతోపాటు బలమైన ఈదురుగాలతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులకు చెట్లు, స్తంభాలు విరిగిపడడంతోపాటు, పూరిళ్లు, రేకుల ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. పడమటనర్సాపురంలో 33 కేవీ విద్యుత్ లైన్‌పై చెట్టు విరిగిపడటంతో విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పరిధిలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో గ్రామాలు అంధకారంలో ఉన్నాయి. మాచినేనిపేటతండాలో విద్యుత్ స్తంభం విరిగిపడింది. గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాలు, దేస్యాతండా తదితర గ్రామాల్లో గడ్డి, రేకుల ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. పలు గ్రామాల్లో మొక్కజొన్న పంట నేలకొరిగి పాక్షికంగా దెబ్బతినగా, తోటల్లోని మామిడికాయలు రాలిపడ్డాయి. రైతులు ఇబ్బందులకు పద్దారు.

ఏజెన్సీలో భారీ వర్షం

ఇల్లెందురూరల్: మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం సాయంత్రం నుంచి రెండు గంటల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులు అధికంగా ఉండటంతో భారీ వృక్షాలు నేలమట్టమయ్యాయి. ఒడ్డుగూడెం గ్రామపంచాయతీలో ఇల్లెందు-మహబూబాబాద్ ప్రధాన రహదారిపై చెట్లు నేలకొరగడంతో కొద్దిసేపు రాకపోకలు నిలిచిపోయాయి. నెహ్రూనగర్ గ్రామంలో నాలుగు విద్యుత్తు స్తంభాలు నేలమట్టమయ్యాయి. భారీ వర్షంతో ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో సాయంత్రం నుంచి ప్రజలంతా అంధకారంలో మగ్గుతున్నారు.




కొత్తగూడెంరూరల్: చెట్లు తొలగిస్తున్న పోలీసులు, జూలూరుపాడు: మాచినేనిపేట తండాలో..., దేస్యాతండాలో ఎగిరిపోయిన ఇంటి పైకప్పు

పాల్వంచ పట్టణానికి పార్కింగ్ కష్టాలు

- రోజురోజుకూ పెరుగుతున్న వాహనాలు
- శాస్త్రిరోడ్‌లో కనీసం వాహనాలు వెళ్లలేని పరిస్థితి
- ఫారెస్ట్ ఆఫీస్ రోడ్‌లో స్తంభాలు పాతడంతో విస్తీర్ణం తగ్గిన రోడ్లు


పార్కింగ్ సమస్య ఉన్న ఫారెస్ట్ కార్యాలయం రోడ్డు

పాల్వంచ: పట్టణంలో రోజురోజుకు వాహనాలు పెరుగుతుండటంతో ట్రాఫిక్, పార్కింగ్ కష్టాలు ఎదురవుతున్నాయి. రోడ్ల విస్తరణలు లేకపోవడం, దుకాణదారులు రోడ్లపైకి వచ్చి వ్యాపారాలు చేస్తుండటంతో వాహనాల రాకపోకలకు, పాదచారులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. వ్యాపార సముదాయాలకు నిలయంగా మారిన శాస్త్రిరోడ్‌లో నిత్యం జనాలతో రద్దీగా ఉంటుంది. అటుగా తిరిగే వారికి షాపింగ్ చేసే ముందు కనీసం షాపు ఎదుట వాహనం పార్కింగ్ చేసుకునే సౌకర్యం కూడా లేకుండా పోయింది. ఇక ద్విచక్ర వాహనాలు ఎక్కడబడితే అక్కడ పార్కింగ్ చేస్తున్నారు. దానికి అవతల డాక్టర్స్ స్ట్రీట్, దాని తర్వాత ఉండే మున్సిపాలిటీ కార్యాలయాల రోడ్లలో అయినా పార్కింగ్ చేసే పరిస్థితి లేకుండా పోతోంది. రోడ్లు విశాలంగా లేకపోవడంతో సమస్య తీవ్రంగా మారింది.

ఫారెస్ట్, మున్సిపాలిటీ రోడ్‌లో మరింత ఇబ్బంది...

మున్సిపాలిటీ రోడ్‌లో మున్సిపల్ కార్యాలయం, ప్రభుత్వాస్పత్రి, తహసీల్దార్ కార్యాలయంతో పాటు అతి పెద్ద నాలుగు రోడ్ల విస్తీర్ణంలో ఫారెస్ట్ సముదాయాలు ఉన్నాయి. అక్కడ వైల్డ్‌లైఫ్ డీఎఫ్ఓ, టెరిటోరియల్ డీఎఫ్ఓ, రెండు రేంజ్ కార్యాలయాలు, డివిజన్ స్థాయి కన్వరెన్స్ హాల్ తదితర సముదాయాలు ఉన్నాయి. ఈ రోడ్డులో పలు షాపులు ఇటీవల వెలవడంతో రద్దీ పెరిగింది. ఆస్పత్రికి నిత్యం రోగులు వచ్చిపోతుంటారు. ఇక ప్రభుత్వ కార్యాలయాలకు అధికారులు, సిబ్బంది తిరుగుతుంటారు. షాపుల వద్ద నిత్యం ప్రజలు ఉంటున్నారు. ఇక ఫుట్‌పాత్ వ్యాపారాలు సైతం పెరుగుతున్నాయి. ఈక్రమంలో అటుగా వెళ్లే వారికి పార్కింగ్‌కు స్థలం లేదు. ఇక ఫారెస్ట్ ఆఫీస్ రోడ్లలో రోడ్డుపైనే పోల్స్ పాతి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. మొక్కలను లోపల గానీ, లేదా ప్రహరీలకు దగ్గరగా నాటాల్సి ఉండగా రోడ్డు వరకు ఫెన్సింగ్ వేస్తుండటంతో రోడ్ల విస్తీర్ణం తగ్గిపోతుందని స్థానికులు వాపోతున్నారు.

ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై చర్యలు శూన్యం...

రాజీవ్‌గాంధీ మార్కెట్, శాస్త్రిరోడ్, ఎంపీడీఓ కార్యాలయం రోడ్, మున్సిపాలిటీ కార్యాలయం రోడ్లతో పాటు, కేఎస్‌పీ రోడ్ నుంచి అల్లూరి సెంటర్ వరకు పలుచోట్ల రోడ్లు, ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురయ్యాయి. వీటిని ఎప్పటికప్పుడు గుర్తించి తొలగించి విశాలంగా చేయాల్సిన పోలీస్, మున్సిపల్ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఫుట్‌పాత్ వ్యాపారాలు సైతం మరింత పెరిగాయి. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణాలు చేసినప్పటికీ ఫుట్‌పాత్ వ్యాపారాలు తగ్గకపోగా మరింత పెరిగాయని స్థానికులు అంటున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్యలు మరింత తీవ్రం అయ్యాయి. ఇప్పటికైనా అధికారులు సమస్యల పరిష్కారంపై దృష్టి సారించి పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.


రోడ్డు పక్కన మొక్కలు నాటే పనులు చేపడుతున్న ఫారెస్ట్ శాఖ

చర్యలు తీసుకుంటాం...

ఫారెస్ట్ రోడ్‌లో ఇతర శాఖలకు, ప్రజలకు ఎటువంటి అవసరం ఉండదు. మా పరిధిలోకి ఇతర వాహనాలు రాకుండా గతంలో మాదిరిగా త్వరలో గేటు కూడా ఏర్పాటు చేసేత ఆలోచనలో ఉన్నాం. రోడ్డు ఖాళీగా ఉందని బయటి వాహనాలు ఇక్కడ పెట్టడం, అసాంఘిక కార్యాకలాపాలకు ఈ రోడ్డును వాడుతున్నారు. దీనివల్ల అధికారులు వచ్చే సమయాల్లో ఇబ్బంది అవుతోంది.

– అనిల్, ఫారెస్ట్ రేంజర్, పాల్వంచ

పార్కింగ్ స్థలాలు చూస్తున్నాం..

మున్సిపాలిటీలో పార్కింగ్‌కు ఇబ్బందులు ఉన్నాయి. పట్టణంలో స్థలాలను పరిశీలన చేయాల్సి ఉంది. పార్కింగ్‌కు సరిపడా ఎక్కడా స్థలాలు ఖాళీగా లేవు. ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి సారించి తగు చర్యలు తీసుకుంటాం. ప్రజలకు ఇబ్బంది కలిగేలా ఎవరైనా అనుమతులు లేకుండా షాపింగ్ నిర్మాణాలు చేస్తే తమకు సమాచారం అందిస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం.

– ఎ.స్వామి, మున్సిపల్ కమిషనర్